పంటలకు వరద ముప్పు!

ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలకు వరద ముప్పుతో రైతులు కలత చెందుతున్నారు. కిన్నెరసాని వాగుకు ఇరువైపులా పంటలకు వానాకాలంలో రక్షణ లేకుండా పోయిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిన్నెరసాని, ముర్రేడు వాగులకు ఇరువైపులా సాగుచేసిన పంటలు ఏటా గేట్లు ఎత్తినప్పుడు వందల ఎకరాల్లో పంట నీటి పాలై రైతులకు తీవ్రనష్టం కలుగజేస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.


ముర్రేడు వాగు ఒడ్డున మునిగిన పొలం (ఫైల్)

- ఏటా రెండు మండలాల్లో రైతులకు నష్టం
- కిన్నెరసాని వాగు పొడవునా అన్నదాతల ఆవేదన
- ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని గ్రామ పంచాయతీలోని కిన్నెరసాని జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు. ప్రాజెక్ట్ గేట్లు ఎత్తితే పరివాహక ప్రాంతంలోని 30 కిలోమీటర్ల దూరం నీరు ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. దాని పొడువున ఉన్న పంటలు నీట మునిగిపోతున్నాయి. కిన్నెరసాని పరివాహక పరిధి పాల్వంచ మండలంలోని కిన్నెరసాని, యానంబైల్, పునుకుల, పాండురంగాపురం, సూరారం, సోములగూడెం, రంగాపురం, నాగారం, నారాయణరావుపేట, దంతలబోరు గ్రామాల్లో వాగుకు ఇరువైపుల సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. అదే విధంగా బూర్గంపాహాడ్ మండలంలో పినపాకపట్టి నగర్, సోంపెల్లి, మిట్టపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయాగ్రామాల పరిధిలో 469 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ముర్రేడు వాగు పరిధిలో సంగం, ఎస్సీ కాలనీ, బంగ్రుగొండ, గొల్లగూడెం గ్రామాల్లో 400 ఎకరాల భూమిలో పంటలు వానాకాలంలో ముంపునకు గురవుతున్నాయి.

ఆగస్టు వస్తే కలవరం...

ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో రైతులు నాట్లు వేసుకున్న తర్వాత ఆగస్టులోనే కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు పరివాహక ప్రాంతంలో ఇరువైపులా వరి, పత్తి పంటలు నీట మునిగిపోవడం, కొట్టుకపోవడంతో రైతులు పంట నష్టపోయి అప్పుల పాలవుతున్నారు.

కిన్నెరసాని ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరిగినప్పుడు జెన్కో అధికారులు ప్రాజెక్ట్ గేట్లు అన్నీ ఎత్తివేస్తున్నారు. దీంతో పంటలతోపాటు, విద్యుత్ మోటార్లతో సహా కొట్టుకపోతున్నాయి.

తక్కువగా గేట్లు ఎత్తాలి...

కిన్నెరసాని నదీ పరివాహక ప్రాంతాలు వరద ముంపునకు గురి కాకుండా ఉండాలంటే ప్రాజెక్ట్ అధికారులు వానాకాలం సీజన్‌లో రిజర్వాయర్‌లో నీటిమట్టం తక్కువగా అంటే 401 లెవల్‌లో గేట్లు ఎత్తితే పంటలు ముంపునకు గురికాకుండా ఉంటాయని రైతులు అంటున్నారు. వరద వచ్చినప్పుడు ఒక్కసారిగా గేట్లు ఎత్తడం వలన నష్టపోతున్నారు. పంటలే కాదు.. కిన్నెరసాని ప్రాజెక్ట్ 12గేట్లు ఒక్కసారిగా ఎత్తడంతో యానంబైల్, కిన్నెరసాని, రాజాపురం గ్రామాలు జలమయం అవుతున్నాయి.


మునిగిన పంటలను సర్వే చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

నష్టపరిహారం చెల్లించడం లేదు..



నాకున్న 1.20 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరానికి రూ.40వేల పెట్టుబడి పెట్టాను. ముర్రేడు వాగు పొంగిపొర్లడంతో చేతికొచ్చిన పంట మొత్తం కొట్టుక పోయింది. తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– బి.లక్ష్మీదేవి, ఎస్సీ కాలనీ

వాగు వరదతో నష్టం..



నాగారంలో కిన్నెరసాని వాగు పక్కన రెండెకరాల పొలం ఉంది. కిన్నెరసాని గేట్లు ఒక్కసారిగా ఎత్తినప్పుడు ఒక ఎకరం మొత్తం కొట్టుకుపోగా, మరో ఎకరంలో ఇసుక మేట వేసింది. గతేడాది పంట మొత్తం నష్టపోయాను. అధికారులు ఆదుకోవాలి.

– జలగం సుధాకర్, నాగారం

వరద ఆధారంగా గేట్లు ఎత్తుతాం..



కిన్నెరసాని ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృత్తి పెరిగినా తక్కువగానే ఎత్తుతాం. గేట్లను ఎత్తే సమయంలో ముందుస్తు చర్యల్లో భాగంగా హెచ్చరికలు జారీ చేసిన తర్వాతనే గేట్లను ఎత్తడం జరుగుతుంది. వరద ఉధృతిని బట్టి గేట్లు ఎత్తుతాం.

– ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ సీఈ

క్లుప్తంగా

కరాటే పోటీల్లో స్వర్ణ పతకం


పతకం అందుకుంటున్న షణ్ముఖ్

పాల్వంచ: స్థానిక ఎయిమ్ లీడ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పసులూరి షణ్ముఖ్ ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగిన ఇండో – నేపాల్ కరాటే అండర్ 14 విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రెంటాల నాగభూషణం, హైస్కూల్ ఇన్‌చార్జ్ సౌజన్య, ఏఓ మోహన్‌రావు షణ్ముఖ్‌ను అభినందించారు.

వితరణ

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పోలిరెడ్డి, సామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారుడు కొప్పుల శ్రీనివాసరెడ్డి కలర్ ప్రింటర్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శేఖర్, కందుల సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మెల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బచ్చల కూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జూలూరుపాడులో మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రఫర్లు ఎస్కే బుడేన్‌పాషా, అచ్యుత్‌లను ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియా గ్రాఫర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సవడం వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి సాంబ, యలబాక రామాచారి, ఎస్కే బబ్లూ, సమీర్, పుల్లారావు, లోకేష్ పాల్గొన్నారు.

టెండర్లు ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో వంట గ్యాస్ డోర్ డెలివరీ కోసం టెండర్లు ఆహ్వానించినట్లు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి కంపెనీ ఉద్యోగస్తులకు ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా కోసం సింగరేణి టెండర్లు ఆహ్వానించిందన్నారు. రెండేళ్ల కాలపరిమితితో యూనిట్ ధర ప్రాతిపదికన కొనసాగుతుందన్నారు. ఆసక్తి గలవారు వచ్చే నెల 10 లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు పర్చేజ్ విభాగంలో సంప్రదించాలని, సూపర్ బజార్‌లో పనిచేసే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల టెండర్ దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు.

టీఎల్‌ఎం మేళా

కొత్తగూడెంఅర్బన్: మండలంలోని ప్రాథమిక స్కూళ్ల టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్ మేళాను కొత్తగూడెం తెలంగాణ స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. మేళాను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మునిగ సుజాత ప్రారంభించి మాట్లాడారు. టీఎల్‌ఎం అంశాలను ఉపయోగించడం, ప్రదర్శించడం వలన పిల్లలను సృజనాత్మకంగా ఆలోచించేలా చేయవచ్చన్నారు. టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్ అంటే చదువుకోడానికి నేర్చుకోవడానికి ఉపయోగపడే వస్తువులు, బొమ్మలు, ఇతర సామగ్రి అని తెలిపారు. అనంతరం ఎంఈఓ ప్రభుదయాళ్ మాట్లాడుతూ ఈ మేళాలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మెటీరియల్‌ను ప్రదర్శించి, విద్యార్థులకు చదువుకోవడం సులభం చేస్తూ, మరింత ఆసక్తికరంగా మారుస్తుందని తెలిపారు. కూలీలైన్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం గణేష్, చందు, హరిబాబు, అర్జున్ పాల్గొన్నారు.

రోజంతా జోరువాన


స్టేషన్‌బస్తీ వైపు పొంగిన బుగ్గవాగు

ఇల్లెందు: రెండు రోజులుగా భారీ వర్షాలకు ఇల్లెందులో జనజీవనం అతలాకుతలం అయింది. మంచినీటి అలుగు చెరువు పొంగి సత్యనారాయణపురం వెళ్లే రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టణంలోని బర్లపెంట ఏరియాలోని రెండు లోలెవల్ కాజ్‌వేలు భారీ వర్షాలకు చెత్తా చెదారం భారీగా కొట్టుకొచ్చి కల్వర్టులో అడ్డు పడడంతో వరద కల్వర్టు మీదుగా ప్రవహించింది. లోతట్టు ప్రాంతం జలమయంగా మారింది.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్)లో ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు జరగనున్న గణేష్ నవరాత్రుల బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఈఓ రజనీకుమారీ భక్తులను కోరారు. మంగళవారం ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాధాకృష్ణ శర్మ, దత్తాత్రేయశర్మ, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి

పాల్వంచరూరల్: ప్రభుత్వ పథకాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి శ్రీరామ్, లీడ్ బ్యాంక్ అధికారి రాంరెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఖమ్మం మేర యువ భారత్ ఆధ్వర్యంలో పువ్వాడ నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ ఆన్ పబ్లిక్ స్కీమ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన శ్రీరామ్ మాట్లాడుతూ యువతకు ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, పీఎంజేఏవై, ముద్రా యోజన, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్స్, స్కిల్ ఇండియా మిషన్, పీఎంకేవై, స్వచ్ఛభారత్ మిషన్, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన వంటి పథకాలపై అవగాహన ఉండాలన్నారు. తద్వారా డిగ్రీ పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి పొందడంతోపాటు నలుగురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.


మాట్లాడుతున్న శ్రీరామ్

స్కిల్ కోర్సులు, సాఫ్ట్ స్కిల్ నేర్చుకుని ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించిన తర్వాత కార్పొరేట్ సంస్థలోకి వెళితే అధిక వేతనాలు పొందే అవకాశాలు ఉంటాయన్నారు. లీడ్ బ్యాంక్ అధికారి రాంరెడ్డి మాట్లాడుతూ.. స్వయం ఉపాధి పొందడానికి బ్యాంకులు ఇచ్చే ముద్ర, విశ్వకర్మ రుణాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ పద్మ, ప్రోగ్రాం ఆఫీసర్ భానుచందర్, విజయప్రసాద్, అరుణకుమారి, స్వరూపరాణి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయండి..


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

జూలూరుపాడు: సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడు హైస్కూల్‌లో సీపీఎస్ రద్దు మహాధర్నా వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మాట్లాడుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను ప్రవేశపెట్టిన సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జూలూరుపాడు హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నాయకులు సీహెచ్ యుగంధర్, కంటిపూడి శ్రీనివాసరావు, రమణ, సాల్మన్ రాజు, జి.సీతారాం, హనుమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఎస్ఎస్‌లను ఏర్పాటు చేసుకోవాలి

టేకులపల్లి: హరితవనాలు ఏర్పాటు చేయడంలో భాగంగా వన సంరక్షణ సమితి సంఘాల ఏర్పాటు, మండలంలో 20 ప్లాంటేషన్లలో వెదురు, టేకు మొక్కలతో కలిపి మొత్తం 44,000 మొక్కలను నాటించి వీఎస్ఎస్ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని టేకులపల్లి ఎంపీడీఓ బైరు మల్లీశ్వరి, మండల అటవీ శాఖాధికారి ముఖ్తార్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం బర్లగూడెం పంచాయతీ జంగాలపల్లి గ్రామం అటవీశాఖ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కలిసి ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొన్న వారు మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఐదేళ్ల తరువాత సంఘానికి ప్రతిఫలాలు అందుతాయని తెలిపారు. గ్రామస్తులు అందూ ఇన్సూరెన్స్, ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. అనంతరం బోడు పంచాయతీ ఉపాధి హామీ పథకంలో రైతు గుజ్జుల అనంతలక్ష్మి నిమ్మతోటను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎండి ముక్తార్ హుస్సేన్ అదనపు కార్యక్రమాలు అధికారి కలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య మరియు కార్యదర్శులు రమాదేవి, సన్యాసి, సతీష్ గారు లు అటవిశాఖ సిబ్బంది హతిరం, రామ్మూర్తి, గాంధీ, గౌరీ, ప్రశాంత్ గారులు ఉపాధి హామీ సిబ్బంది భీముడు, ఈశ్వరి, సత్యనారాయణ, నరేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లీశ్వరి

కాంగ్రెస్ పార్టీలో చేరిక

జూలూరుపాడు: కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండాకు చెందిన 25 బీఆర్ఎస్ కుటుంబాలు మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చావా వెంకటరామారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అల్లాడి నరసింహారావు పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

జూలూరుపాడు: యూరియా అధికంగా వాడటం వల్ల భూసారం తగ్గడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పంటలకు యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియా, నానో డీఏపీలను వాడాలని కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు అన్నారు. మంగళవారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలోని ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఏఓ దీపక్ ఆనంద్, ఏఈఓ విజయభాను, సొసైటీ సెక్రటరీ రమణారెడ్డి, సిబ్బంది సాయి, అమల, సునీత, రైతులు పాల్గొన్నారు.

ఐరన్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి

ఇల్లెందు: పట్టణంలోని 2వ వార్డు ఇల్లెందులపాడు హిందూ శ్మశానవాటికకు అలుగు వాగు మీదుగా శవాల తరలింపు కష్టాలు తీరాయి. రెండు నెలల క్రితం ఇల్లెందులపాడు మంచినీటి చెరువు అలుగు వాగు మీద ఐరన్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. మూడేళ్ల క్రితం వాగు పొంగి లోలెవల్ చప్టా కొట్టుకుపోయింది. దీంతో వర్షాకాలంలో వాగు పొంగితే వాగు దాటే పరిస్థితి ఉండదు. దీంతో గత మున్సిపల్ పాలకవర్గం ఐరన్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించగా ఇప్పుడు పూర్తయింది.

అధికారులు సమన్వయం చేసుకోవాలి

ఇల్లెందురూరల్: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేస్తూ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. పల్లెల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చాలని, తాగునీటి పైపులకు లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాలలో నిరంతరం పర్యటిస్తూ ప్రజల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తూ జాగ్రత్తలు సూచించాలని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని వైద్యులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయ అధికారులు యూరియా పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, డీఎస్పీ చంద్రభాను, ఎంపీడీఓ ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి..

టేకులపల్లి: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామవరంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో జరగనున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు గుగులోత్ రామ్‌చందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సీపీఐ వందేళ్ల కాలంలో చేసిన పోరాటాలు, త్యాగాలు వెల కట్టలేనివన్నారు. దేశ స్వాంతత్ర్య పోరాటంలో అనేకమంది కమ్యూనిస్టు నాయకులు కుట్ర కేసులను ఎదుర్కొని జైళ్లలో బంధించబడ్డారని, ప్రాణత్యాగాలు చేసినట్లు చెప్పారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దున్నేవాడికి భూమి, సామాజిక న్యాయం కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సీపీఐ మహోజ్వల పాత్ర నిర్వహించిందన్నారు. కార్మిక, కర్షక, యువజన, విద్యార్థి, మహిళా శ్రమజీవుల సమస్యలపై పార్టీ నిరంతరం పోరాడుతుందని, వృత్తి సంఘాలను నిర్మాణం చేసి వారి హక్కుల కోసం నిరంతరం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు.

26న ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: 26న మహబూబ్‌నగర్‌లో జరగనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ భారతదేశ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు పెంచడంతో వ్యవసాయ రంగం సంక్షోభంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు రైతులను పోరాటాకు సిద్ధం చేయటానికి భవిష్యత్ కార్యాచరణపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, ఏఐయూకేఎస్ మండల అధ్యక్షుడు లింగాల వీరభద్రం, కార్యదర్శి తోటకూరి నరేష్, రావూరి వెంకటేశ్వర్లు, ఎం.నాగేశ్వరరావు, బాదావత్ జవహర్‌లాల్, బానోత్ వీరు, తదితరులు పాల్గొన్నారు.

పారితోషికం వద్దు.. వేతనం ఇవ్వండి..

సుజాతనగర్: ఆశా కార్యకర్తలకు పారితోషకానికి బదులుగా కనీసం గౌరవ వేతనం రూ.18000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు వీర్ల రమేష్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవా కార్యక్రమాలు చేసిన ఆశా కార్యకర్తలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే ఆశాల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్నా వారి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఆశా కార్యకర్తలకు పారితోషకానికి బదులుగా గౌరవవేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గుగులోత్ జగన్, ఆశా కార్యకర్తలు తోళ్ల జయమ్మ, తబిత, అనసూర్య, వసంత, గంగ, విజయ, కుమారి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

‘యూరియా సరఫరాలో కేంద్రం విఫలం’


మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచ: రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే ఇప్పటి వరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయిందని, యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం అన్నారు. మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా ఈ రాష్ట్ర రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వాటాను తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, బీవీ సత్యనారాయణ, రాము, జకరయ్య, రామాచారి, శ్రీను, వెంకటేశ్వర్లు, అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

పాల్వంచ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో హథీరాం మహారాజ్ మఠాన్ని కూల్చివేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, దీనిని బంజరా జాతి ఖండిస్తుందని జగదాంబ సేవాలాల్ బుడియా బాపు గిరిజన సేవా సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ రాములు నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ మహారాజ్ అన్నారు. మంగళవారం స్థానిక కరకవాగులో శ్రీ జగదాంబ తుల్జా భవానీ ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కూల్చివేతను నిలిపివేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించాలన్నారు. బంజారా జాతి మేధావులు ఈనెల 23న చలో తిరుపతికి తరలిరావాలని పిలుపునిచ్చారు. శంకర్, రమేష్, బాలు, గురుప్రసాద్, గ్రామ్‌ఫల్ పాల్గొన్నారు.

గణేష్ మండపాల బాధ్యత నిర్వాహకులదే..

ఇల్లెందు: గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. మంగళవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయక భక్త మండలి కమిటీల సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ.. ప్రతీ మండపం నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేసి అనుమతులు తీసుకోవాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన చోట ఇతరులకు ఇబ్బందులు లేని ప్రదేశంలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. డీజే సౌండ్‌లు ఏర్పాటు చేయవద్దని, రాత్రి వేళల్లో గుంపులుగా తిరగవద్దని సూచించారు. విద్యుత్ లైన్ల కింద మండపాలు ఏర్పాటు చేయరాదని, విద్యుత్, అగ్నిమాపక శాఖ అనుమతులు ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హసీనా, సూర్య తదితరులు ఉన్నారు.

జూలూరుపాడు: గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ..ఉత్సవ కమిటీ సభ్యులు తెలంగాణ పోలీస్‌శాఖ రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీని ద్వారా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడానికి సులభంగా ఉంటుందన్నారు. గణేష్ మండపాల బాధ్యత నిర్వాహకులదేనన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు, నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయరాదన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దగ్గరలో ఇసుక, నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండపం వద్ద పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, విధిగా పోలీస్ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో సంతకం చేస్తారని చెప్పారు. అనుమానస్పదమైన బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కన్పిస్తే 100 డయల్ చేయాలన్నారు.

పాల్వంచరూరల్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే వారు మండపాల ఏర్పాటు కోసం పోలీసుల అనుమతులు తీసుకోవాలని రూరల్ ఎస్ఐ బి.సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉత్సహాలు ముగిసే వరకు మండప నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లు మండపంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు.


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను